# దృష్టి

-వై. కె. మూర్తి

"తిరిగి నిన్ను చూశాక నా జీవితంలో వసంతం తిరిగి వచ్చింది. విజయ మిగిల్చి వెళ్లిన - చేదు నీ సహచర్యంలో సమసిపోవాలని కోరుకుంటు న్నాను. నీవు కాదనవన్న నమ్మకం నాతో ఈ ఉత్తరం రాయిస్తోంది. ఇప్పటికే పెద్ద ఉత్తరం అయింది. నీ వాడిని కావాలని మనసారా వాంఛించే, నీ శేఖర్".

ఆ పెద్ద ఉత్తరం చదవటం పూర్తి చేసి దీర్ఘంగా నిట్టూర్చింది మాధవి. శేఖర్‌కి విజయవాడ బదిలీ అయి దాదాపు రెండేళ్లయింది. ఇద్దరికీ ఒకే బ్యాంకులో ఉద్యోగాలు. అతను 'డైవోర్సీ' అని మొదట ఎవరో చెప్పగా విన్నది. ఇద్దరూ ఒకే రూట్లో వెళ్లే వాళ్లు గనుక మొదట తడిపొడి మాటలతో అయినా పరిచయం. రాను రాను కాస్త చిక్కబడింది. అతనెప్పుడూ ఏదో ఆలోచిస్తూం టాడు. అతన్ని చూస్తే ఏదో ఓ విధమైన జాలి కలుగుతుంది.

రానురాను పరిచయం పెరిగి పార్కుల్లో కలుసుకునేదాకా వచ్చింది. తన వ్యక్తిగత విషయాలు అతను చెప్తోంటే ఆశ్చర్యంగా వినేది మాధవి. అతనే విషయాలైతే చెప్తూ వచ్చాడో అవే విషయాలు మరింత విపులంగా ఈనాటి లెటర్లో రాశాడు.

విజయను గురించిన ముఖ్యమైన విషయాలు, ఆమెకు భర్తంటే గౌరవం లేదు. చాలా నిర్లక్ష్యం. అతని ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం ఆమెకు ఒక హాబీ. ఎప్పుడూ తన వాళ్లకి ఆర్థిక సహాయం చేయడానికి ప్రాకులాడేదట. ఇంటి పనిలో కూడా భర్తను పాలు పంచుకోమనేదట. ప్రతి దానికి భర్తను సాధిం చేదట... ఇలా ఎన్నెన్నో!

పై కారణాల వల్ల వాళ్లిద్దరి మధ్య రేగిన కలహాలు ఉధృతమై విడాకులకు దారి తీశాయి.

ఆమె మరీ అంత దుర్మార్గంగా ఎలా ప్రవర్తిం చేదో మాధవికి అర్థం అయ్యేది కాదు. విద్యావతి, ఉద్యోగవతి, శేఖర్ చెప్పే ధోరణిలో ప్రవర్తించడం ఆశ్చర్యం కలిగించింది.

కొంతకాలానికి విజయపై ద్వేషం, శేఖర్‌పై జాలి, సానుభూతి పెరిగి ఆమె పాజిటివ్‌గా వ్యవహరించడమే ఈనాడు ఈ ఉత్తరానికి కారణం.

అతనికి పిల్లలు కూడా లేరట. అందువల్ల అంత మంచివాడిని నిరాకరించ వలసిన అవసరం మాధవికి ఏకోశానా కనిపించలేదు. మంగళ వాయిద్యాలతో వేద ఘోషతో ఘెళ్ళున పెళ్ళి జరిగి పోయింది.

✡✡✡

మాధవి పెళ్ళయి మూడు సంవత్సరాలౌ తోంది.

ఆలోచనలు వేధిస్తోంటే విపరీతమైన అలసట, అశాంతికి ఉపశమనం దగ్గర్లో వున్న పార్కుకు వెళ్ళి కూర్చోడం అలవాటైంది ఆమెకు.

ఆరోజు కూడా ఆ పార్కులో చల్లగాలి అనుభవిస్తూ కళ్లు ఒక్క క్షణం మూసుకుంది. ఆమె పార్కు ఫ్రెండ్ శాంతి ఇంకా రాలేదు!

ఆలోచనలు ఆమెను వేధిస్తున్నాయి.

తనీ పెళ్ళి చేసుకొని చాలా అమూల్యమైన జీవితపు విలువలు కోల్పోయింది. ఈ మూడు సంవత్సరాల వైవాహిక జీవిత సారాంశం - తగవులూ, అశాంతి తనెంత పొరపాటు చేసింది!

శాంతి తన ఇద్దరు పిల్లలతో ప్రతి రోజూ పార్కులో సరదాగా కాలం గడుపుతుంది. కనీసం పిల్లల వల్లనైనా బాధలు మర్చిపోదామంటే తనకు ఆ అవకాశమూ లేకపోయింది.

సాధారణంగా ప్రతి స్త్రీ సంసార నావను ముందుకు నడపడానికే శాయశక్తులా కృషి చేస్తుంది. స్త్రీలో అటువంటి సహనం జన్మతో వచ్చే ఒక వరం. ఆమె ఆ నావను మధ్యలో ముంచేసి వెళ్ళిందంటే కారణాలు బలీయంగా వుండాలని తను ఊహించలేకపోయింది. తనెంత మూర్ఖ

రాలు!

శేఖర్‌తో మూడేళ్ల సహచర్యంతో తన పొరపాటు అర్థమైంది. తను కనీసం కూరగాయలు కొనడానికైనా, అతని అభిప్రాయం తెలుసుకోనిదే నిర్ణయం తీసుకోరాదు. విజయ స్వయంగా నిర్ణయాలు తీసుకోవడం ఇటువంటిదేనేమో! తనకు శేఖర్‌ని పేరు పెట్టి పిలుస్తూ స్నేహితుడిలా ట్రీట్ చేయాలని వుండేది. కాని పెళ్ళయిన నాటి నుంచీ అతను "మీరు" అనమని ఆదేశించాడు.

బహుశా భర్తంటే గౌరవం లేకపోవడం ఇదేనేమో! తన జీతం అంతా అతని చేతిలో పోయాలి. ముసలితనంలో వున్న తల్లిదండ్రులకు ఏ మాత్రం సహాయం చేయడానికి వీల్లేదు.

తను భరించలేని ఈ స్థితిని విజయ మాత్రం ఎలా భరించి వుంటుంది? ఇద్దరూ ఆఫీసు నుంచి అలసి పోయి వస్తే, ఇంటికి రాగానే చాకిరీ అంతా తన పైనే వేసి అతను టీవీ చూస్తూ పేపర్ చదవడం ఆమెను మరీ బాధించేది. అతని అసహ్యమైన వ్యక్తిత్వంలో - మగవారితో మాట్లాడితే అనుమానించడం కూడా వుండేది. విజయ మగవారితో మాట్లాడడం అంటే ఆసక్తి చూపేదని అతను అనడం ఇదేనేమో!

ఇటువంటి పరిస్థితుల్లో తనకే ఎటైనా పారిపోదామని అనిపిస్తుంటే, ఇక ఐదు సంవత్సరాలు ఆ విజయ ఎలా భరించిందో?

ఆలోచనల్లో మునిగి వున్న మాధవికి తననెవరో పిలవడంతో ఉలిక్కిపడింది.

ఎదురుగా చిరునవ్వుతో శాంతి, ఆమె ఇద్దరు పిల్లలతో సహా.

''మీరు ఆలోచిస్తున్నదేమిటో చెప్తే ఏమిస్తారు?" అంది శాంతి.

"వేరుశనక్కాయలు కొని పెడ్తాను"

"పిల్లలూ! వేరుశనక్కాయ లతన్ని వెదుక్కు రండి" అంటూ వాళ్లని పంపింది.

"మీరివాళ మరీ దిగులుగా కనిపిస్తున్నారు" అంటూ సంభాషణకు ఉపక్రమించింది శాంతి.

కొన్ని రోజులుగా తనలో రగులుతున్న దావానలాన్ని వెళ్లగక్కి వాతావరణాన్ని వేడిగా మార్చింది మాధవి.

"నాకు తెలుసు మాధవీ! మీ బాధలు, సమస్యలు అన్నీ తెలుసు. నేను మీతో స్నేహంగా మసలడానికి కారణం కూడా అదే. మీకు తెలియని ఓ నిజాన్ని చెప్పడం అంత మంచిది కాకున్నా చెప్పక తప్పడం లేదు. శేఖర్‌కి ఇద్దరు పిల్లలున్నారు. అతను వేసక్టమీ చేయించుకున్నాడు. కనుక మీకింక పిల్లలు కలిగే అవకాశం కూడా లేదు" అంది శాంతి.

అవాక్కయిన మాధవి తెప్పరిల్లడానికి కాసేపు పట్టింది.

బొంగురు పోయిన కంఠంతో ప్రశ్నించింది.

"మీకెలా తెలుసు ఈ విషయం?"

"అతని మొదటి భార్య విజయను నేనే కాబట్టి. నా పూర్తి పేరు విజయశాంతి" విషాదంగా నవ్వి చెప్పింది శాంతి.

"క్షమించండి. ఈ విషయం మీకు చెప్పకూడదన్న నియమాన్ని ఉల్లంఘించాను. ప్రతి రోజు మీరు దిగులుగా వుండడం చూడలేక పోతున్నాను. నిజానికి ఈ పిల్లలతో నేనిప్పుడు చాలా హాయిగా బ్రతుకుతున్నాను. ఈ విషయం, అంటే నన్ను కలుసుకొంటున్న విషయం మీ భర్తగారికి తెలిస్తే మీరింక పార్కుకు వచ్చే అవకాశం కూడా వుండదు".

"ఇంతటి స్నేహశీలి, సుగుణాలరాశి, అందగత్తె శేఖర్‌ని సంతోష పెట్టలేక పోయిందంటే, అతని అహం, మూర్ఖత్వమే కారణాలుగాని మరింకేమీ కాదు" అనుకొంది మాధవి.

"నన్ను క్షమించండి శాంతి. మొదట్లో శేఖర్ చెప్పిన విషయాలన్నీ గుడ్డిగా నమ్మి మిమ్మల్ని అపార్థం చేసుకున్నాను. ఫలితంగా నా జీవితంలో వసంతం పోయింది" అంది దిగులుగా మాధవి.

"పిచ్చిదానా! నిన్ను క్షమించడమేమిటి?" అంటూ ఆప్యాయంగా ఆమె భుజం తట్టి.

"చాలా మంది స్త్రీలు స్త్రీ సమస్యలను స్త్రీ కోణంలో నుంచి ఆలోచించరు. పురుషుడి దృష్టితో కాక స్త్రీ దృష్టితో సమస్యను అవగాహన చేసుకోగలిగితే స్త్రీ జాతికి ఈ కష్టాలే వుండవు" అంది శాంతి.

సరిగ్గా అప్పుడే పిల్లలు, వేరుసెనక్కాయ లతన్ని తీసుకువచ్చి వాళ్ల వంక ప్రశ్నార్థకంగా చూశారు. ■